క్లుప్తంగా

పాఠశాలల బంద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ఇచ్చోడ: ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ నాయకులు రమేశ్, సాయి, అజయ్, వినీత్, శివ, తేజ కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలలో కనీస మౌలిక సదుపాయలు కల్పించాలని, ప్రైవేట్‌లో ఫీజు దోపిడీని అరికట్టే విధంగా నియంత్రణ చట్టం తీసుకురావాలని రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పిల్లలు సెల్‌ఫోన్ వాడకం నిషేధించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం నిషేధం విధించాలని మానవహక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అతిష్ కాంబ్లే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించి, జిల్లా విద్యాధికారి ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సెల్‌ఫోన్ ఇవ్వడం ద్వారా వచ్చే అనార్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు రాథోడ్ శ్రీకాంత్, సురాజ్ సోన్‌కాంబ్లే, విశాల్ పరత్ వాగ్, తదితరులు పాల్గొన్నారు

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తాంసి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ లక్ష్మి తెలిపారు. చెక్కుల పంపిణీకి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటలకు ఎమ్మెల్యే హాజరై చెక్కులను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



'రైతునేస్తం' తిలకిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: రైతునేస్తం కార్యక్రమంలో శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం టెలీ కాన్ఫరెన్స్ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా రైతు భరోసా కార్యక్రమంపై అభిప్రాయాలు సేకరించారు. మండల కేంద్రానికి చెందిన రైతులు సోన్‌కాంబ్లే గోపినాథ్ మాట్లాడుతూ.. 10 ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకే రైతు భరోసా పరిమితం చేయాలన్నారు. అనంతరం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ రకాల పంటల సాగుపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. అధిక మోతదులో ఎరువులు, క్రిమీ సంహారక మందులు వాడొద్దన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు రాథోడ్ గణేష్, అరుణ, ఏఈవోలు వీర, మల్లేష్, నవతేజ్, కరుణ, లత భారతి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పట్టుకున్న వాహనాలతో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని కుమురంభీం చౌక్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలను పాటించని వాహనాలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతీ వాహనదారుడు వాహనానికి ముందు, వెనుక తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లేదంటే చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదిలా బాద్ పట్టణంలో చాలా మంది నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్నారని, వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పంటల నమోదే కీలకం

- రైతుభరోసా, పంటల కొనుగోళ్లకు పంటల నమోదే ఆధారం
- పంట భూములకు డిజిటల్ సర్వే
- సర్వే ఆధారంగానే పథకాలు



జిల్లాలో సాగు విస్తీర్ణం : 5,79,546 ఎకరాలు

రైతులు: 1.78 లక్షలు

బోథ్: రైతుభరోసా అందించాలన్నా, పండించిన పంటలు ప్రభుత్వం కొనాలన్నా పంటల నమోదు కీలకంగా మారనుంది. దీనికోసం ప్రత్యేకంగా ప్రభుత్వం సర్వే నిర్వహించాలని భావిస్తోంది. పంటల నమోదును కూర్చున్న చోట కాకుండా క్షేత్ర స్థాయిలో వెళ్లి నమోదు చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. పంటల నమోదే కీలకంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తోంది. ప్రతిఏటా వ్యవసాయాధికారులు పంటల నమోదును చేస్తున్నా.. పకడ్బందీగా చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన చేయకుండా రైతులు చెప్పిన పంటల నమోదు చేస్తున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. నమోదు చేసిన పంటకు, వాస్తవానికి పండించిన పంటలకు చాలా చోట్ల భిన్నంగా ఉండటంతో ప్రభుత్వం పంటలను కొనుగోలు చేస్తున్నప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొంతమంది వ్యాపారులు తమ అనుకూలంగా ఉండే రైతుల పంటలను అధికారుల చేత తప్పుగా నమోదు చేయిస్తున్నారు. ప్రభుత్వం పంటలను కొనుగోలు చేసే సమయంలో సదరు రైతుల పేరిట వ్యాపారులు తమ పంటలను విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

సాగు భూములకే రైతు భరోసా!

ఇక గత ప్రభుత్వంలో కొండలు, గుట్టలు, మైదాన ప్రాంతాలు, వెంచర్లలో పంటలు పండించకున్నా రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయాన్ని అప్పటి ప్రభుత్వం అందించింది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సాగుభూమికి మాత్రమే రైతుభరోసా పేరిట పెట్టుబడి సాయాన్ని అందించనున్నట్లు తెలుస్తోంది. సాగు భూములు నిర్ణయించేందుకు ప్రభుత్వం వ్యవసాధికారులతో సర్వే చేయించాలని భావిస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పంటల సాగు వివరాలు, విస్తీర్ణం నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం యాప్‌ను ఉపయోగించనున్నారు. సాగు చేసే పంట ఫోటోను, సంబంధిత సర్వే నంబరు భూమిలోనే ఉండి ఫొటో తీయాల్సి ఉంటుంది. దీంతో పంటల సాగు వివరాలు నమోదులో అవకతవకలకు పాల్పడే అవకాశం ఉండదు. మరోవైపు కేంద్రం అనుమతితో డిజిటల్ క్రాప్ సర్వేను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. పక్కా సాగు వివరాల నమోదు చేసిన తరువాత రైతు భరోసాతో పాటు ఇతర పథకాలను అమలు చేయడానికి సులువు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 8శాతం భూములు సాగులో లేవని తెలుస్తోంది.

పంటల నమోదు ఆధారం..

ప్రభుత్వం ప్రతియేటా వివిధ రకాల పంటలను కొనుగోళ్లు చేస్తోంది. పంటల కొనుగోళ్లకు సైతం పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం కొనుగోళ్లు చేయనుంది. సర్వే ఆధారంగా రైతు ఎంత విస్తీర్ణంలో ఏ పంటలు పండించారో ఆన్‌లైన్‌లో రికార్డు అవుతుంది. ఆ రైతుకు సంబంధించిన రికార్డు ఆధారంగానే పంటలను కొనుగోలు చేసే వీలుంటుంది. అయితే ప్రభుత్వం ఎకరాకు పరిమితి విధిస్తే రైతు నష్టపోయే ప్రమాదం ఉంది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పలు డిమాండ్లతో కూడిన కరపత్రాలను కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. గత మూడు నెలల నుంచి కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పంచాయతీ కార్మికులు ఇచ్చే వేతనల గురించి పంచాయతీలు మొండిగా వ్యవహరిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలే ప్రసుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తుందని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, మండల నాయకుల కొలిపాక అశోక్, యూసుపొద్దిన్, ఆరెపల్లి అంజయ, ముక్కరి రాజేశ్వర్, రాంబాయి పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజనతో రాజుయాదవ్‌కు సంబంధం లేదు



మాట్లాడుతున్న చొక్కపల్లి రాములు

నేరడిగొండ: పీఎం విశ్వకర్మ యోజనతో బోథ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు గొర్ల రాజుయాదవ్‌కు ఎలాంటి సంబంధం లేదని పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన కన్వీనర్ చొక్కపల్లి రాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీలో సస్పెండ్ అయిన గొర్ల రాజు యాదవ్ పార్టీ ఇచ్చిన పదవిని వాడుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలెవరూ కూడా అతడిని నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎంపీ నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు స్పందించి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేరడిగొండ మండల బీజేపీ అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, ప్రధాన కార్యదర్శులు బంటు ప్రవీణ్, ధర్మపురి రాఘవులు, ఆకుల రాజశేఖర్ పటేల్ పాల్గొన్నారు.

పక్కాగా నల్లాల లెక్క



సర్వే చేస్తున్న అధికారులు

- కొనసాగుతున్న ఇంటింటా సర్వే
- వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు

తలమడుగు: గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధజలం అందించాలని ఉద్దేశంతో గత ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి శుద్ధజలం అందజేస్తున్నామని మిషన్ భగీరథ విభాగం ఇంజనీర్ పేర్కొంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత మిషన్ భగీరథపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈపథకం ద్వారా క్షేత్రస్థాయిలో నీరు అందుతుందా? లేదా? అన్న వివరాలు తెలుసుకోవడంతో పాటు, కేంద్ర నిధులు పొందేందుకు ఇంటింటా సర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్వే ప్రారంభించారు. ప్రత్యేక యాప్‌లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి, మిషన్ భగీరథకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న గ్రామ కార్యదర్శులు, సర్వే చేయడంలో నిమగ్నమయ్యారు. తలమడుగు మండలంలో 28 గ్రామ పంచాయతీలలో సర్వే చేపడుతున్నారు. మండలంలో దాదాపు 8807 వరకు నల్లా కనెక్షన్లు ఉండగా.. ఇప్పటి వరకు 6వేల నల్లాల సర్వే పూర్తయినట్లు అధికారులు చెపుతున్నారు. మండలంలోని కుచులపూర్, బరంపూర్, సుంకిడి, కజర్ల, దేవాపూర్, ఝరి, ఉమ్రీ, పల్లి, లింగి, ఖోడద్, ఉండమ్ గ్రామాల్లో 70 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

వివరాలు ఇలా..

సర్వే నిర్వహించేవారు ప్రతిరోజు నిర్దేశించిన ఇళ్లను సందర్శించాలి. ఆయా ఇళ్లకు మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో ఏ మేరకు అమలవుతుందో, నల్లా కనెక్షన్ ఉందా? పైప్ లైన్ ఉందా? ఎలా ఉన్నాయి? అని నమోదు చేయాలి. ఆయా వివరాలతో పాటు ఆధార్ కార్డ్, ఫోన్ నెంబర్, కుటుంబసభ్యుల ఫొటో తీసి యాప్‌లో నమోదు చేయాలి. గ్రామపంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, మహిళా సంఘాల సభ్యులు నేతృతంలో ప్రతీ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేపడుతున్నారు. నల్లా కనెక్షన్ ఉందా? ఉంటే నీరు ఎలా వస్తుంది? ప్రతిరోజు ఎన్ని లీటర్ల నీటి సరఫరా అవుతున్నాయి. తదితర అంశాలను నమోదు చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు కాకుండా ఇంకా ఏమైనా వనరుల ద్వారా నీళ్లు వస్తున్నాయా, వంటి వివరాలు నమోదు చేస్తున్నారు. వీటిని మండల కార్యాలయం, అక్కడి నుంచి జిల్లాకు ప్రతిరోజు పంపిస్తున్నారు. ఇంటింటి సర్వే అనంతరం మిషన్ భగీరథ రిజర్వాయర్లు, నీటి పంపులు, ట్యాంకులు, పైప్‌లైన్ వివరాలు యాప్‌లో పొందుపరుస్తున్నారు.

సమగ్ర సర్వే చేపడుతున్నాం

మిషన్ భగీరథ పథకం లక్ష్యం ఏ మేరకు అమలవుతుంది. నల్లా నీటిని ప్రజలు ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారు అని సర్వే చేస్తున్నాం. ఈ వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయిస్తున్నాం. దీంతో సమగ్ర నివేదిక సిద్ధం కానుంది.

– శేఖర్, ఎంపీడీవో

ఆడే గజేందర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నేరడిగొండ: తాగునీటి సమస్యను తీర్చేలా బోర్ వేయించిన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ చిత్రపటానికి మండలంలోని మాట్‌లొద్ది గ్రామస్తులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. బోర్ వేయించడంతో పాటు మోటార్ ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

గుంతలు సిద్ధం చేయాలి



గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: రానున్న రోజుల్లో మొక్కలు నాటే గుంతలను సిద్ధం చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఉపాధికూలీలు ద్వారా తవ్వుతున్న గుంతలను పరిశీలించి మాట్లాడారు. ప్రతీ పంచాయతీ పరిధిలో ఉన్న కూలీల ద్వారా గుంతలు తవ్వించాలన్నారు. వర్షలు కురిసిన వెంటనే మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వాటర్ ప్యూరిఫైర్ అందజేత

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయురాలు విజయరెడ్డి, ఉపాధ్యాయులు అడెల్లు, మాధవ్ విద్యార్థులకు ప్యూరిఫైర్ అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గుర్తుగా విద్యార్థులకు కోసం అందచేసినట్లు తెలిపారు. గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన ఎంపీపీ

బోథ్: మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం బోథ్ మండల అధ్యక్షుడు తుల శ్రీనివాస్ ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అధికార పార్టీపై పెరుగుతున్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ సూచించినట్లు పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ మీదుగా మండలంలోని యాపల్‌గూడ రోడ్డు మార్గంలో ప్రతీ రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈరోడ్డు మార్గంలో గత ఏడాది కిందట బంగారుగూడ సమీపంలో వంతెన నిర్మాణం చేపట్టారు. వంతెనకు అనుకొని ఉన్న అప్రోచ్ రోడ్డు వద్ద రెయిలింగ్ లేక పోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదాలు జరిగే ముందు రెయిలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సీఎం రేవంత్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఇంద్రవెల్లిలో..

ఇంద్రవెల్లి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి ఏకకాలంలో రుణమాఫీ చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మెస్రం నాగ్‌నాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ నిర్ణయాన్ని హర్షిస్తూ సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఆగస్టు 15 లోపు రూ. 2లక్షల రుణమాఫీ చేసి రైతులకు అండగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, సోమోరే నాగోరావ్, మసుద్, మీర్జా యాకుబ్‌బెగ్, జితేందర్, గేడం సుమన్‌బాయి పాల్గొన్నారు.

రుణమాఫీ కాంగ్రెస్‌తోనే సాధ్యం

తలమడుగు: దేశ చరిత్రలోనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబాన్నా, ప్రకాష్ రావు, గోక భూమారెడ్డి, రమేశ్ రెడ్డి, కమలాకర్, వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

బోథ్: ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై కాంగ్రెస్ నాయకులు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు యాదవ్‌లు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించి కొంతమంది రుణమాఫీ చేసి ఎంతోమంది రైతులను అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ ఉమేష్ మెరుగు భోజన్న, గడ్డల నారాయణ పాల్గొన్నారు.

'ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్యం ఖూనీ'



మాట్లాడుతున్న కొప్పు బాషా

గుడిహత్నూర్: ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన రోజు అని మాజీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ 21 రోజుల ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. రాజ్యాంగ గౌరవం, భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి దేశ ప్రజలందరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. అనంతరం నల్ల బ్యాడ్జీ ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు 1పతంగే బ్రహ్మానంద్, మయూర్ చంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

28న వారసంత వేలం

నేరడిగొండ: మండల కేంద్రంలో ప్రతీ శని వారం నిర్వహించే వారసంత వేలంను ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనాలనుకునే వారు రూ.10వేల ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో నెగ్గి నవారు 24 గంటల్లోపు నాల్గో వంతు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

29న అడ్డెగడులకు వేలం

ఇచ్చోడ: ఈనెల 29 మధ్యాహ్నం 12 గంటలకు పశువుల, మేకల, వార, దినసంతలతో పాటు అడ్డె గడులకు వేలం నిర్వహించనున్నట్లు మేజార్ గ్రామపంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. షెడ్యూల్ తె గలకు చెందిన స్థానికులు మాత్రమే అర్హులని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు గతంలో పంచాయతీకి ఎలాంటి బాకాయి ఉండరాదన్నారు. రూ. 1.50వేలు ఎస్‌బీఐ ద్వారా డీడీ తీసి, ఉదయం 10.30 నిమిషాలకు పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో అధి కారులను సంప్రదించాలని కోరారు.

29న తైబజార్ వేలం

బోథ్: బోథ్ మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంత వేలాన్ని ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ ఈవో అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. పాల్గొనేవారు రూ.40 వేల రూపాయలు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలం పూర్తయిన వెంటనే తైబజార్ దక్కించుకున్న వ్యక్తి సగం డబ్బు చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

అందుబాటులో ఎరువులు



మాట్లాడుతున్న దామోదర్ రెడ్డి

తలమడుగు: రైతులకు ఎరువుల కొరత లేకుండా ఉండేందుకు మండలంలో ఏడు కేంద్రాలలో అందుబాటులో ఉంచడం జరిగిందని తలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం సహకార సంఘ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. కుచులపూర్, ఉమ్రీ, బరంపూర్, సుంకిడి, తలమడుగు, ఉండం, పల్లి(బి) గ్రామాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. గత ఏడాది నాలుగు కోట్ల రూపాయలతో ఎరువులు విక్రయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పద్మాకర్ రెడ్డి, సీఈవో మోతి శ్రీనివాస్, డైరెక్టర్లు, సెక్రటరీలు సాగర్, గంగయ్య, భీంరావు, సత్యనారాయణ, రమాకాంత్ పాల్గొన్నారు.

హోటళ్లను తనిఖీ చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మనోజ్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని హోటల్లు, స్వీట్ హౌస్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ కుమార్ మాదిగ కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజలు అనారోగ్యం భారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.



